క్లుప్తంగా

టీడీపీ నేత దందాలపై కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు

నాగాయలంక: మండల స్థాయి టీడీపీ నేత ఒకరు రేషన్ డీలర్ల సహకారంతో అర్ధరాత్రి వేళల్లో గ్రామాల్లో పర్యటిస్తూ తలుపులు తట్టి రేషన్ బియ్యం కొనుగోలు చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదులు వెళ్లాయి. మండలంలోని పర్రచివర శివారు బిల్లీగ్రాహం నగర్(ఎస్సీ కాలనీ)కి చెందిన చిక్కాల సురేష్‌బాబు సోమవారం బందరులో ఈమేరకు జిల్లా కలెక్టర్, ఎస్పీలకు లిఖితపూర్వకంగా ఫిర్యాదులు అందజేశారు. సదరు టీడీపీ నేత పగటి పూట నాగాయలంక పోలీస్‌స్టేషన్‌లో సెటిల్‌మెంట్లు, రాత్రివేళల్లో రేషన్ బియ్యం అక్రమ దందా నిర్వహిస్తూ చట్టాన్ని యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారని ఆరోపించారు.

పెడన ఉపాధ్యాయినులకు సావిత్రిబాయి పురస్కారం

పెడన: పట్టణంలోని కళాంజలి హైస్కూలు ఉపాధ్యాయినులకు సదరన్ ప్రైవేటు లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ సావిత్రీ బాయి పూలే జాతీయ పురస్కారాలను అందజేసినట్లు హైస్కూలు ప్రిన్సిపాల్ కె.దిలీప్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డులను ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు చేతుల మీదుగా అందుకున్నారని పేర్కొన్నారు. హైస్కూలు కరస్పాండెంట్ కోలవెన్ను ప్రసన్నలక్ష్మి, ఉపాధ్యాయురాలు ఆశప్ప త్రివేణి పురస్కారాలను అందుకున్నారని తెలిపారు.

ఫిబ్రవరి 1 నుంచి వీరికి పింఛన్లు కట్!



కె. కొత్తపాలెం(మోపిదేవి): ఆంధ్రప్రదేశ్‌లో అర్హతలు లేకుండానే పింఛన్లు అందుకుంటున్న వారిని ఏరివేసేందుకు అధికార యంత్రాంగం తనిఖీలు ప్రారంభించింది. మండల పరిధిలోని కె.కొత్తపాలెంలో వైద్యబృందం సోమవారం ఇంటింటా తిరిగి తనిఖీలు చేపట్టింది. దివ్యాంగుల కేటగిరీలో అర్హత లేని వారిని గుర్తించి యాప్‌లో అప్‌లోడ్ చేశారు. గ్రామంలో దివ్యాంగ పింఛన్లు పొందుతున్న 12 మంది ఇంటింటికీ వెళ్లి తనిఖీలు నిర్వహించారు. ఒకవేళ వైద్య పరీక్షలకు సహకరించకపోతే ఫిబ్రవరి 1 నుంచి పింఛన్లు నిలిపివేస్తారు. అనంతరం మాట్లాడుతూ మండలంలో ఉన్న 88 దివ్యాంగ పింఛన్లు(బెడ్‌రీడ్) అందుకుంటున్న వారికి ఇంటింటా వెళ్లి రెండు రోజుల్లో తనిఖీలు పూర్తిచేస్తామని తెలిపారు. మూడు బృందాలు మండలంలో పర్యటిస్తున్నాయని వివరించారు.

నాటు సారా తయారీదారులు ఏడుగురు బైండోవర్

పెడన: నాటు సారా తయారీదారులు దక్షిణ తెలుగుపాలెం, నందమూరు పంచాయతీ కోట వానిపాలెం గ్రామాలకు చెందిన ఏడుగురిని సోమవారం పెడన ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్ ఎదుట బైండోవర్ చేశారు. వీరికి షరతులతో వ్యక్తిగత పూచీకత్తుపై విడిచిపెట్టారు. గూడూరు మండలంలోని సూరాదాయిపేటలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆధ్వర్యంలో సోమవారం దాడులు నిర్వహించి 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ అధికారులు రామశేషయ్య, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నీటి సంఘాల అధ్యక్షులకు సన్మానం

నాగాయలంక: మండల ఎరువులు, పురుగు మందుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక శ్రీవాసవీ కల్యాణ మండపంలో సోమవారం స్థానిక వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు బండ్రెడ్డి నాగ మల్లికార్జునరావు (చినబాబు), భావదేవరపల్లి, గణపేశ్వరం నీటి సంఘాల అధ్యక్షులు బండ్రెడ్డి నీలాంబరరావు, కారంకి కృష్ణలను ఘనంగా సన్మానించారు. మండలంలో ఎరువుల డీలర్లుగా ఉన్న ఈ ముగ్గురూ నీటి సంఘాల అధ్యక్షులుగా(వీరిలో ఒకరు డీసీ ప్రెసిడెంట్) ఇటీవల ఎన్నికైన సందర్భంగా గౌరవ పూర్వకంగా సంఘం నేతృత్వంలో ఈ సన్మానాలు చేశారు. కార్యక్రమానికి అతిథులుగా భావదేవరపల్లి సర్పంచి మండలి ఉదయ భాస్కర్, మండల టీడీపీ అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు హాజరయ్యారు. సంఘం అధ్యక్షుడు రామ్‌భూపాల్, చిట్టా శివ నాగేశ్వర రావు తదితర సంఘ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీమన్నారాయణుడి అధ్యయనోత్సవాలు ప్రారంభం

కోడూరు: అభినవ మేల్కోటగా పేరుగాంచిన ఉల్లిపాలెం గోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణ స్వామివారి ఆలయంలో సోమవారం అధ్యయనోత్సవాలను ప్రారంభించారు. ఆలయ నిర్మాణకర్త అష్టాక్షరీ సంపత్‌కుమార రామానుజ జీయర్ స్వామిజీ పర్యవేక్షణలో ఉదయం ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. తిరుమంజన సేవను భక్తిప్రపత్తులతో జరిపారు. నమ్మాళ్వార్లు, రామానుజాచార్యుల విగ్రహాలతో పాటు కలశపూజలు నిర్వహించారు. గర్భాలయంలోని శ్రీమన్నారాయణుడి మూలవిరాట్‌కు చేసిన ప్రత్యేక అలంకారం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ నెల 24వ వరకు అధ్యయనోత్సవాలు జరుగుతాయని అష్టాక్షరీ స్వామీజీ చెప్పారు.

ప్రమాదకరంగా వంతెనల మార్జిన్లు

- శిథిలమై ఇనుపచువ్వలు పైకి లేచినా పట్టించుకోని గుత్తేదారు
- పూర్తి నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్న జాతీయ రహదారి అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



పెందుర్రు-మునిపెడ గ్రామాల మధ్య శిథిలమైన వంతెన మార్జిన్లు

బంటుమిల్లి: పెడన నియోజకవర్గ పరిధిలో ఉన్న 216 జాతీయ రహదారిపై ఉన్న వంతెనల మార్జిన్లు సిమెంటు లేచిపోయి గుంతలు పడి ఇనుప చువ్వలు కనపడుతూ ప్రమాదకరంగా ఉన్న సంబంధిత నేషనల్ హైవే అధికారులు పట్టించుకోవడంలేదు. పెడన నియోజకవర్గ పరిధిలోని పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లో దాదాపు 45 నుంచి 50 కి.మీ మేరకు 216వ నంబరు జాతీయ రహదారి నిర్మించారు. ఈ రహదారి ఆద్యంతం సిమెంటుతో నిర్మించారు. రహదారి పూర్తి స్థాయిలో వినియోగంలోకి వచ్చి సుమారు మూడు సంవత్సరాలకు పైగా అవుతోంది.

నాణ్యతపై అనుమానాలు

216వ నంబరు జాతీయ రహదారి నిర్మాణంలో వినియోగించిన కాంక్రీటు కొద్ది నెలలకే పెచ్చులు లేచిపోవడంతో నాణ్యతపై అనుమానాలు తలెత్తుతున్నాయి. జాతీయ రహదారిపై ఉన్న లజ్జబండ మేజరు డ్రెయిన్‌పై నిర్మించిన వంతెనపై సిమెంటు పెచ్చులు లేచిపోయి ఇనుప చువ్వలు కనిపిస్తున్నా మరమ్మతులు చేపట్టలేదు. పెడన నుంచి పల్లెపాలెం గ్రామం వరకు జాతీయ రహదారిపై ఉన్న చిన్న, పెద్ద వంతెనల మార్జిన్లు కుంగిపోవడం, మార్జిన్ల సిమెంటు పెచ్చులు లేచిపోయి ఇనుప చువ్వలు కనిపిస్తూ వాహనదారులు గుంతల్లో పడి లేచినప్పుడు పెద్ద శబ్దాలు చేస్తూ భయపెడుతున్నాయి. 214 వ నంబరు జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్న క్రమంలో గోదావరి జిల్లాల నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనాలన్నీ ఈ రహదారి గుండానే ప్రయాణిస్తున్నాయి. భారీ వాహనాలు తిరగడంతో పాటు, వాహనాల రద్దీ కారణంగా రహదారి శిథిలమైన చోట్ల మరింత దెబ్బ తింటోంది.



శిథిలమైన బంటుమిల్లి ప్రధాన కాలువపై ఉన్న వంతెన మార్జిన్లు

ఉదాసీన వైఖరిలో గుత్తేదారు

216వ నంబరు జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా గుత్తేదారు రోడ్డు మరమ్మతులు చేయాల్సి ఉంది. అయితే గుత్తేదారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా అధికారులు పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారన్న ఆరోపణలున్నాయి. వంతెనల వద్ద రోడ్డు శిథిలమైనా టోల్‌గేటు రుసుము వసూలు చేసుకుంటున్న గుత్తేదారు మరమ్మతులు చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

త్వరలో మరమ్మతులు చేయిస్తాం

పెడన-పల్లెపాలెం మధ్యంలో 216 జాతీయ రహదారి మరమ్మత్తులకు గురైన చోట త్వరలో రిపేర్లు చేయిస్థాము. సాధ్యమైనంత వరకు సోమవారం నుంచి పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాము. ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడకుండ చూస్తాము.

–గోపాల్, ప్రాజెక్టు మేనేజరు

రీ సర్వే సమయంలో రైతులు కూడా ఉండాలి

బందరు ఆర్డీవో స్వాతి



వేములపల్లి రీ సర్వే గ్రామ సభలో రైతులతో మాట్లాడుతున్న బందరు ఆర్డీవో కె.స్వాతి

వేములపల్లి(ఘంటసాల): భూ సమస్యల పరిష్కారానికి చేపడుతున్న రీ సర్వే సమయంలో రైతులు కూడా అందుబాటులో ఉండాలని బందరు ఆర్డీవో కె.స్వాతి అన్నారు. ఘంటసాల మండలం వేములపల్లి గ్రామంలో సోమవారం ఏపీ రీ సర్వే ప్రాజెక్టు గ్రామసభ నిర్వహించారు. సభకు హాజరైన ఆర్డీవో స్వాతి సర్వే జరుగుతున్న వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రైతులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వేములపల్లి గ్రామంలో 612 ఎకరాల భూములు ఉండగా మూడు బృందాలుగా సర్వే చేస్తున్నట్లు చెప్పారు. ఒక్కో బృందం రోజుకు 20 ఎకరాల చొప్పున రీ సర్వే చేస్తున్నట్లు తెలిపారు. రీ సర్వేకి సంబంధించి రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చిన రైతులు క్షేత్రస్థాయిలో జరిగే సర్వేలో తప్పనిసరిగా పాల్గొనాలని, వారికి సంబంధించిన పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డు, ఫొటో తీసుకొచ్చి సర్వేయర్లకు అందించాలన్నారు. రీ సర్వేలో పాల్గొనే సిబ్బంది సమర్థంగా విధులు నిర్వహించాలని, రైతుల వివరాలు సక్రమంగా నమోదు చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం రీ సర్వే పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.వి జయ ప్రసాద్, రీ సర్వే డీటీ పి.శ్రీనివాసరావు, ఆర్ఐ కె.శ్రీనివాస్, మండల సర్వేయర్ సీహెచ్ వల్లీ పుష్ప, వీఆర్వో, సర్వేయర్లు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

రీసర్వేతో భూ వివాదాలు పరిష్కారం

కోడూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రీసర్వేతో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ శ్రీనునాయక్ అన్నారు. మండలంలోని పిట్టల్లంక పంచాయతీలో సోమవారం భూముల రీసర్వేను రెవెన్యూ అధికారులు ప్రారంభించారు. స్థానిక సచివాలయం వద్ద సర్పంచి కనగాల వెంకటేశ్వరరావు అధ్యక్షతన ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని రైతులు తమ పొలాల దస్తావేజులు, పట్టాదార్ పాసుపుస్తకాలు, ఆధార్ జిరాక్స్‌తో పాటు తమ వివరాలను సంబంధిత వీఆర్వోకు అందించాలని తహసీల్దార్ సూచించారు. రికార్డుల పరిశీలన అనంతరం సర్వే నిర్వహించి, భూముల మధ్య సరిహద్దులను తేల్చి, సర్వే రాళ్లను వేసి కొత్త పట్టాదార్ పాస్‌పుస్తకాలను అందించనున్నట్లు చెప్పారు. రైతులు ఈ సర్వేకు సహకరించి, ప్రక్రియ వేగవంతంగా సాగేలా చూడాలని కోరారు. అనంతరం సిబ్బంది గ్రామంలోని ప్రధాన రహదారుల వెంట ర్యాలీ నిర్వహించారు. రీసర్వే డీటీ పద్మప్రియ, ఆర్ఐ సుభాషిణి, వీఆర్వో గోపాలకృష్ణ, సర్వేయర్లు పాల్గొన్నారు.

ఆదివనవలమ్మ ఆలయంలో అన్న సమారాధన

మచిలీపట్నంటౌన్: నగరంలోని నిజాంపేటలో ఉన్న ఆదివనవలమ్మదేవి ఆలయంలో సోమవారం అన్న సమారాధన నిర్వహించారు. అమ్మవారి 108వ వార్షిక గ్రామోత్సవ సంబరంలో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో వందలాది మంది భక్తులు అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ ధర్మకర్తలు నూతి వన వెంకట సత్యన్నారాయణ (రమణ), వన సాయిప్రసాద్, వన శ్రీనివాస రావు, వన శ్రీరాములు, భక్త బృందం ప్రతినిధులు పర్యవేక్షించారు. ఫిబ్రవరి 16వ తేదీన అమ్మవారి నెల సంబరం జరుగుతుందని వారు తెలిపారు.

జనసేన నేత గృహ నిర్మాణానికి మున్సిపల్ తాగునీరు!

- ఏకంగా ట్యాంకర్ పెట్టి డ్రమ్ముల్లోకి నీటి సరఫరా
- పట్టించుకోని అధికారులు



శాయిన శివయ్య గృహ నిర్మాణానికి తాగునీటిని డ్రమ్ముల్లో నింపుతున్న ట్యాంకర్ డ్రైవర్

మచిలీపట్నంటౌన్: నగరంలోని రాడార్ కేంద్రం సమీపంలో జనసేన నాయకుడు శాయన శివయ్య నిర్మిస్తున్న నూతన గృహ నిర్మాణానికి మున్సిపల్ తాగునీటిని వినియోగిస్తున్నారు. ఆ ప్రాంతంలోని రైల్వే గేటు పక్కనే ఉన్న స్థలంలో శివయ్య ఇటీవల గృహనిర్మాణాన్ని ప్రారంభించారు. ఈయన 13వ డివిజన్ జనసేన ఇన్‌చార్జ్‌గా ఉండటంతో తన అధికారాన్ని ఉపయోగించి సోమవారం ఏకంగా మున్సిపల్ తాగునీటి ట్యాంకర్‌ను నిర్మాణం వద్దకు రప్పించుకుని మరీ తాగునీటిని డ్రమ్ముల్లోకి పట్టించుకుని ఆ నీటిని గృహ నిర్మాణానికి వినియోగిస్తున్నారు. నిర్మాణం ప్రారంభించిన నాటినుంచీ ఇదే తంతు ఇక్కడ జరుగుతున్నా మున్సిపల్ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఓ పక్క నగర శివారు ప్రాంతాల్లోని ప్రజలకు తాగునీరు పూర్తిస్థాయిలో అందక నానా ఇబ్బందులు పడుతుంటే జనసేన నాయకుని గృహ నిర్మాణానికి మాత్రం నగరపాలక సంస్థ అధికారులు సంవృద్ధిగా తాగునీటిని ట్యాంకర్ల ద్వారా అందిస్తున్నారు. గృహ నిర్మాణాలకు తాగునీటిని అందించేందుకు పదేళ్ల కిందట రూ.200 చలానా కట్టించుకుని మున్సిపల్ అధికారులు నీటిని అందించేవారు. గత పదేళ్లుగా ఈ పద్ధతిని నిలిపివేశారు. ప్రస్తుతం వివాహాది శుభ కార్యాలకు మాత్రం ఆయా డివిజన్‌ల కార్పొరేటర్‌ల సిఫార్సులతో మాత్రమే తాగునీటిని ట్యాంకర్ల ద్వారా అందిస్తున్నారు. ఈ ఘటనపై జిల్లా అధికారులు ఎలా స్పందిస్తారో చూడాలి.

హెల్మెట్ వాడకంపై అవగాహన కార్యక్రమం



కోనేరుసెంటర్: జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా బందరు ట్రాఫిక్ పోలీసులు సోమవారం మచిలీపట్నంలో హెల్మెట్ వినియోగంపై వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు ఆదేశాలతో సిబ్బంది సోమవారం నగరంలోని అనేక ప్రాంతాలలో వాహనదారులకు ట్రాఫిక్ రూల్స్‌ను వివరించారు. ట్రాఫిక్ సీఐ ఏవీ శివకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో భాగంగా ట్రాఫిక్ సిబ్బంది ప్రత్యేక ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. హెల్మెట్, సీటుబెల్టు వినియోగాలపై వివరిస్తూ కరపత్రాలు పంచిపెట్టారు. ప్రధాన కూడళ్ల వద్ద వాహనదారులతో ట్రాఫిక్ నియమ నిబంధనలు తూచాతప్పక పాటిస్తామంటూ ప్రతిజ్ఞలు చేయించారు. నగరంలోని బస్టాండ్ సెంటర్, రేవతి సెంటర్, కోనేరు సెంటర్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ వలంటీర్‌లకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించి వాహనదారులకు అవగాహన కల్పించేందుకు వారి సేవలను వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమాల్లో ట్రాఫిక్ ఎస్ఐలు, ఏఎస్ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్



ఉచిత పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ తదితరులు

పెడన: పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, పాడి పరిశ్రమ అభివృద్ధి చెందాలంటే పాడి పశువులు ఆరోగ్యంగా ఉండాలని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని జింజేరు గ్రామంలో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉచితంగా పాడి పశువులకు అందించే ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి 31వ తేదీ వరకు మండల వ్యాప్తంగా అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో ఈ శిబిరాలను నిర్వహిస్తున్నామని పశుసంవర్ధక శాఖ ఏడీ కొనకళ్ల బాబు రావు తెలిపారు. అనంతరం ఉచిత పశువైద్య శిబిరాల వాల్‌పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అర్జా వెంకట నగేష్, టీడీపీ మండల అధ్యక్షుడు శెలపాటి ప్రసాద్, కార్యదర్శి శీరం ప్రసాద్, సర్పంచ్ వేముల సత్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

కమ్మనమోలులో 150 పశువులకు చికిత్స

కమ్మనమోలు(నాగాయలంక): మండల పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో కమ్మనమోలు గ్రామ పంచాయతీ పరిధిలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ సీహెచ్ సాయి మౌనిక నేతృత్వంలో సోమవారం జరిగిన ఉచిత పశువైద్య శిబిరంలో నట్టల నివారణ, గర్భకోశ వ్యాధులకు చికిత్స, వ్యాధి నిరోధక టీకాలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సనకా మురళీకృష్ణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మౌనిక పశువుల యజమానులతో మాట్లాడుతూ పశు వైద్యశిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లింగ నిర్ధారణ వీర్యం, బహు వార్షిత పశుగ్రాసాలు, పశు కిసాన్ కార్డు తదితర అంశాలపై అవగాహన కలిగించి సంబంధిత బ్రోచర్‌లను సర్పంచ్, రైతుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. మండలంలోని పెదపాలెంలో 23న, మ(త్రి)పాలెంలో 25న, నాచుగుంటలో 28న , చోడవరంలో 31న ఉచిత పశు వైద్య శిబిరాలు జరుగుతాయని డాక్టర్ మౌనిక చెప్పారు.

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

బంటుమిల్లి: పశు సంవర్ధక శాఖ ద్వారా ప్రభుత్వం ఉచితంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకుని పశు సంపద ఆరోగ్యంగా ఉండే విధంగా చూడాలని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని మణిమేశ్వరం గ్రామంలో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాన్ని సోమవారం ఆయన ప్రారంభించి రైతులకు కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు పాడి పశువులు, జీవాలు, కోళ్లు ఒక ప్రత్యామ్నాయ ఆదాయ వనరులని అన్నారు. అవి అనారోగ్యాల పాలు కాకుండా సకాలంలో వైద్య చికిత్స అందిస్తే పంటతో పాటు ఆదాయం గణనీయంగా ఆ కుటుంబానికి ఉపయోగపడుతుందన్నారు. పశువైద్యుడు రాజీవ్‌నాయక్ శిబిరం ద్వారా రైతులకు అందుతున్న సేవల వివరాలు ఎమ్మెల్యేకి తెలిపారు. కార్యక్రమంలో మల్లేశ్వరం డీసీ చైర్మన్ బొర్రా కాశీ, టీడీపీ మండల అధ్యక్షుడు కె.వీరబాబు, గ్రామ మాజీ సర్పంచ్ దింటకుర్తి మధుసూదన్‌రావు, రైతులు పాల్గొన్నారు.

82 పశువులకు వైద్య పరీక్షలు

మండల పరిధిలోని మణిమేశ్వరం గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 82 పశువులకు పలు రకాల పరీక్షలు చేసి మందులు అందజేశారు. శిబిరంలో వైద్యులు రాజీవ్‌నాయక్, అసిస్టెంటు వైవీ ప్రసాదు, రాజీవ్, శ్రావణి, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

కె.కొత్తపాలెంలో ఉచిత పశువైద్య శిబిరం

కె. కొత్తపాలెం(మోపిదేవి): మండలంలోని కె.కొత్తపాలెంలో పశువైద్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కొక్కిలిగడ్డ మాధవి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మచిలీపట్నం డివిజన్ పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకుడు డాక్టర్ నాగభూషణం మాట్లాడుతూ పశు సంపద పెరిగితేనే పాల ఉత్పత్తి దిగుబడి పెరుగుతుందన్నారు. వ్యవసాయంతో పాటు పశు సంపదను ప్రతి రైతు పెంపొందించాలని కోరారు. మండలంలో అధిక పశుసంపద ఎక్కువగా కె.కొత్తపాలెంలో ఉన్నందున ఈ గ్రామంలో పశువైద్య శిబిరం చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా దూడలకు అందాల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందచేశారు.

గ్రామంలో పశువైద్యశాల ఏర్పాటు చేయాలి

మండలంలోనే అత్యధికంగా పశుసంపద ఉన్న కె.కొత్తపాలెంలో పశువైద్యశాల లేకపోవడంతో వ్యాధిసోకిన పశువులను దూర ప్రాంతాలకు తరలించలేక పోతున్నామని పలువురు రైతులు ఉప సంచాలకుడు డాక్టర్ నాగభూషణం దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో పశువైద్యశాల ఏర్పాటుకు తన వంతు కృషిచేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం 45 పశువులకు వైద్య పరీక్షలు చేసి, దూడలు 48, గొర్రెలు, మేకలు 135 జీవాలకు నట్టల నివారణ మందు అందించారు. మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు చందన రంగారావు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు పూషడపు రత్నగోపాల్, మత్తి వంశీ, గన్నవరం డీఎల్‌డీఏ హరిత, మండల పశువైద్యాధికారి డాక్టర్ నందకిషోర్, గుర్జాలా బేగం, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ విద్యశ్రీ




అవనిగడ్డ: అవనిగడ్డ నూతన డీఎస్పీగా టి.విద్యశ్రీ సోమవారం బాధ్యతలు చేపట్టారు. సబ్‌డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

● కార్తికేయుని సన్నిధిలో...

మోపిదేవి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మోపిదేవి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారిని అవనిగడ్డ నూతన డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన టి.విద్యశ్రీ సోమవారం సాయంత్రం కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. ఆలయ అధికారి బర్మా ప్రసాద్ స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాలు అందించి సత్కరించారు. ఆమె వెంట చల్లపల్లి సీఐ ఈశ్వరరావు, ఎస్ఐ సత్యనారాయణ పోలీస్ సిబ్బంది, ఆలయ అధికారులు ఉన్నారు.

● డీఎస్పీగా చప్పిడి రాజా బాధ్యతల స్వీకరణ



కోనేరుసెంటర్: బందరు డీఎస్పీగా చప్పిడి రాజా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల జరిగిన డీఎస్పీల బదిలీల్లో భాగంగా గ్రేహౌండ్స్‌లో శిక్షణ పొందిన రాజాను బందరు సబ్‌డివిజన్‌కు బదిలీ చేస్తూ రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు బదిలీ చేస్తూ ఈ నెల 17న ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం రాజా జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావును మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. అనంతరం డీఎస్పీ రాజాకు సాదర స్వాగతం పలుకుతూ సబ్‌డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు, ఇతర సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేశారు.

● ఎమ్మెల్యే పర్యటనలో అపశృతి

గూడూరు: మండలంలోని ఆకుమర్రులో సోమవారం జరిగిన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పర్యటనలో అపశృతి చోటు చేసుకుంది. గ్రామంలో వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభించడానికి ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ రావడంతో పార్టీ శ్రేణులు టపాసులు కాల్చి స్వాగతం పలికారు. ఈ సమయంలో టపాసులు బొల్లా అశోక్‌కుమార్‌కు చెందిన వరి గడ్డి వాముపై పడి మంటలు అంటుకున్నాయి. ప్రమాదంలో మూడు ఎకరాల వరిగడ్డి పూర్తిగా కాలిపోయింది.

● అభివృద్ధి పనులు ప్రారంభం

గూడూరు: మండలంలో పలు గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ సోమవారం ప్రారంభించారు. గురిజేపల్లి, కంకటావ గ్రామాల్లో నిర్మించిన సిమెంటు రోడ్లు, రామరాజుపాలెంలో వెల్‌నెస్ సెంటర్, అంగన్‌వాడీ కేంద్రం, ఆకుమర్రులో వెల్‌నెస్ సెంటర్, మల్లవోలు, తరకటూరులో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీ చైర్మన్ పోతన వెంకటలక్ష్మీ నరసింహస్వామి, వైస్ ఎంపీపీ నేతల కుటుంబరావు, ఎంపీటీసీ సభ్యుడు జక్కా ధర్మారాయుడు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

● జవహర్ నవోదయ పరీక్షలపై అవగాహన అవసరం

పెడన: జవహర్ నవోదయ పరీక్షల వలన కలిగే ప్రయోజనాలపై మరింత మంది విద్యార్థులకు అవగాహన కల్పించి ఆయా పరీక్షలు రాసేలా ప్రోత్సహించాలని విశ్రాంత విద్యాశాఖాధికారి మట్టా రాధాకృష్ణమూర్తి అన్నారు. స్థానిక ప్రాథమిక (బంగ్లాస్కూలు)లో జవహర్ నవోదయ పరీక్ష రాసిన విద్యార్థినులను సోమవారం ఆయన అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భాగ్యలక్ష్మి, ఎస్‌ఎంసీ వైస్ చైర్మన్ బాబు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● వీధికుక్కల బెడద నివారించండి

పెడన: పట్టణంలో ఎక్కడ చూసినా వీధి కుక్కల బెడద అధికంగా ఉందని, తక్షణం తగు చర్యలు తీసుకోవాలని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం అధికారులకు అర్జీ అందజేశారు. పట్టణంలోని పాతపేటకు చెందిన కె.లోక్‌నాథం సోమవారం ఇన్‌చార్జి తహసీల్దారుకు కె.అనిల్ కుమార్‌కు ఈ మేరకు అర్జీ సమర్పించారు. పెడన- గుడివాడ ప్రధాన రహదారి పక్కనే ఉన్న తామరచెరువులో గుర్రపు డెక్క పేరుకుపోయిందని, గుర్రపు డెక్కను తొలగించి తామర చెరువును ఆదాయ వనరుగా చేస్తే పట్టణాభివృద్ధితో పాటు రహదారి పక్కన సుందరంగా ఉంటుందని లోక్‌నాథం అర్జీ అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దారుతో పాటు మున్సిపల్ కమిషనర్ గోపాలరావు, వివిధ శాఖల అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

● 300 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

గూడూరు: మచిలీపట్నం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మండలంలోని సూరదాయిపేటలో సోమవారం సీఐ పి.వెంకటేశ్వరమ్మ ఆధ్వర్యంలో సిబ్బంది విస్తృత దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నాటు సారా తయారీ కోసం సిద్ధం చేసిన 300 లీటర్ల బెల్లపు ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. ఎస్ఐ ఎం.రామశేషయ్య, సిబ్బంది దాడుల్లో పాల్గొన్నారు.

● చీడపీడల యాజమాన్యంపై శిక్షణ

ఘంటసాల: జీవ నియంత్రణ పద్ధతుల్లో చీడపీడల యాజమాన్యంపై నిర్వహిస్తున్న నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి అన్నారు. ఘంటసాలలోని కృషి విజ్ఞాన కేంద్రంలో జీవ నియంత్రణ పద్ధతులతో చీడపీడల యాజమాన్యంపై ఆరు రోజుల నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ జిల్లాలోని పలు ప్రాంతాల్లో గ్రామీణ యువతకు జీవ నియంత్రణ పద్ధతులతో చీడపీడల యాజమాన్యంపై శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.వెంకటేశ్వరమ్మ, జిల్లా వనరుల కేంద్రం డీడీఏ జ్యోతి రమణి, శ్రీనివాస్, పద్మజ, వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త లహరి, కేవీకే శాస్త్రవేత్తలు మంజువాణి, యశ్వంత్, వెంకటలక్ష్మి, నవీన్, కృష్ణవేణి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

● దాతల సేవలు అభినందనీయం

గోగినేనిపాలెం(ఘంటసాల): దాతల సహకారంతో అందించిన సోషల్ స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని 10వ తరగతిలో ఉత్తీర్ణత సాధించాలని గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం తమ్మన వేణుగోపాలరావు అన్నారు. ఘంటసాల మండలం గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు కొడాలి గ్రామానికి చెందిన హైస్కూల్ పూర్వ విద్యార్థి పరాశరం రాజశేఖర చక్రవర్తి ఆర్థిక సహకారంతో సోమవారం హెచ్‌ఎం తమ్మన వేణుగోపాలరావు సోషల్ స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ సీనియర్ సోషల్ స్టడీస్ ఉపాధ్యాయులతో ప్రత్యేకంగా రూపొందించిన ఈ స్టడీ మెటీరియల్ ఉపయోగించుకుని విద్యార్థులు నూరు శాతం మార్కులు సాధించాలని సూచించారు. స్టడీ మెటీరియల్ అందించిన దాత రాజశేఖర చక్రవర్తికి పాఠశాల విద్యా కుటుంబం తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

● అపరాల సాగులో మెలకువలతో అధిక దిగుబడులు

గూడూరు: అపరాల సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని గుంటూరు లాం ఫాం వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ గోపాలస్వామి, డాక్టర్ సత్యనారాయణ రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని ఆకులమన్నాడు, కోకనారాయణపాలెం గ్రామాల్లో పర్యటించిన వారు అపరాల సాగును పరిశీలించారు. సాగులో పాటించాల్సిన మెలకువలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.ఆంజనేయ కుమార్, వీఏఏలు బ్రహ్మం, ప్రతాప్, రైతులు పాల్గొన్నారు.

● కలపటంలో గ్రౌండ్ ట్రూతింగ్ ప్రారంభం

గూడూరు: ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్టులో భాగంగా మండలంలోని కలపటం గ్రామంలో గ్రౌండ్ ట్రూతింగ్ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. దీనిలో భాగంగా రీ సర్వే డీటీ కె.జ్ఞానసాయి, మండల సర్వేయరు కె.మురళీకృష్ణ ఓఆర్ఐ పట్టాలను తెచ్చి పొలాల సరిహద్దులను మార్కింగ్ చేసుకున్నారు. తహసీల్దారు డి.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ రోజుకు 20 ఎకరాలు మాత్రమే గ్రౌండ్ ట్రూతింగ్ జరుగుతుందన్నారు. రైతులు అందుబాటులో ఉండి రీ సర్వే ప్రక్రియకు సహకారం అందించాలని కోరారు. వీఆర్వో ఎస్.వెంకటేశ్వరరావు, సర్వేయరు వీరబాబు, రైతులు పాల్గొన్నారు.

● నేడు వికలాంగ పింఛన్ల తనిఖీ

ఘంటసాల: ఎన్టీఆర్ భరోసా పథకం కింద ఘంటసాల మండలంలో రూ.15 వేలు తీసుకుంటున్న లబ్ధిదారులను మంగళవారం కృష్ణాజిల్లా పెన్షనర్ల తనిఖీ బృందం పరిశీలించనున్నట్లు ఘంటసాల ఎంపీడీవో డి.సుబ్బారావు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఆయా గ్రామాల్లోని రూ.15 వేలు పెన్షన్ తీసుకుంటున్న లబ్ధిదారులు ఇళ్ల వద్ద ఉండి సహకరించాలని ఎంపీడీవో సుబ్బారావు కోరారు.